RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 297 సెప్టెంబర్ 14 సోమవారం 2026 ప్రకాశం పేజీలు : 8 వెల - 10

గణపతి బొప్పా మోరియా..!

- విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు
- గజాననుడి అవతారం వెనుక పురాణ గాథ
- జ్ఞానానికి ప్రతీకగా గణాధిపతి
- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

ఒంగోలు, అక్షర ప్రకాశం : విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. జ్ఞానం, వినయానికి ప్రతీక శ్రీ మహా గణపతి హిందూ సంప్రదాయంలో ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా పూజించేది శ్రీ మహా గణపతినే. విఘ్నేశ్వరుడు, గణాధిపతి, గజాననుడు, వినాయకుడు వంటి అనేక నామాలతో భక్తులు ఆయనను కొలుస్తారు. జీవితంలో ఎదురయ్యే విఘ్నాలను తొలగించి, శుభకార్యాలు విజయవంతంగా సాగేందుకు గణపతి అనుగ్రహం అవసరమని భక్తుల విశ్వాసం. ప్రతి సంవత్సరం భాద్రపద మాసం శుక్లపక్ష చతుర్థి రోజున వినాయక చవితిని దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. పురాణ కథనం ప్రకారం.. ఒకరోజు పార్వతీదేవి కైలాసంలో స్నానానికి సిద్ధమవుతూ తనకు రక్షణగా ద్వారం వద్ద ఒక కాపలాదారు ఉండాలని భావించారు. తన శరీరానికి రాసుకున్న నలుగు పిండితో ఒక బాలుడి ప్రతిమను రూపొందించి, అందులో ప్రాణశక్తిని ప్రసాదించారు. అనంతరం ఆ బాలుడిని ద్వారం వద్ద కాపలాగా

2 లో

గణపతి బొప్పా మోరియా..!

(మొదటి పేజీ తరువాయి)

ఉంచి, తన అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి రానివ్వవద్దని ఆదేశించారు. తల్లి ఆజ్ఞను శిరసావహించిన బాలుడు ద్వారం వద్ద కాపలాగా నిలిచాడు. అదే సమయంలో పరమశివుడు కైలాసానికి చేరుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పార్వతీదేవి ఆజ్ఞను పాటిస్తున్న బాలుడు శివుడిని కూడా అడ్డుకున్నాడు. తల్లి అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించబోనని స్పష్టం చేశాడు. పరిస్థితి తీవ్రంగా మారడంతో జరిగిన ఘర్షణలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడని పురాణ కథనం చెబుతోంది. ఈ విషయం తెలుసుకున్న పార్వతీదేవి తీవ్ర దుఃఖానికి, ఆగ్రహానికి గురయ్యారు. తన కుమారుడిని తిరిగి ప్రాణాలతో తీసుకు రావాలని కోరారు. పార్వతీదేవి ఆగ్రహాన్ని శాంతింపజేయడానికి పరమశివుడు తన గణాలను ఒక ప్రత్యేకమైన తలను తీసుకురావాలని ఆదేశించారు. వారు ఏనుగు తలను తీసుకువచ్చి బాలుడి శరీరానికి అమర్చగా, శివుడు తన దివ్యశక్తితో మళ్లీ ప్రాణం పోశారని పురాణాలు వివరిస్తున్నాయి. అలా ఏనుగు ముఖంతో పునర్జన్మ పొందిన బాలుడు గజాననుడిగా ప్రసిద్ధి చెందాడు. అనంతరం పరమశివుడు ఆయనను తన కుమారుడిగా స్వీకరించి, సర్వదేవతల సమక్షంలో గొప్ప వరాలను ప్రసాదించారు. గణాధిపత్యం ఎవరికివ్వాలనే విషయంలో గణపతి, కుమారస్వామి మధ్య పోటీ ఏర్పడినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. ముల్లోకాల్లోని పవిత్ర ప్రాంతాలను సందర్శించి ముందుగా తిరిగి వచ్చినవారికి గణాధిపత్యం ఇవ్వాలని శివుడు షరతు విధించారు. కుమారస్వామి తన నెమలి వాహనంపై బయలుదేరగా, గణపతి మాత్రం తన తల్లిదండ్రులైన శివపార్వతుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తల్లిదండ్రులే తనకు ముల్లోకాలతో సమానమనే భావంతో ఆయన చేసిన ప్రదక్షిణలను చూసి శివపార్వతులు ఎంతో సంతోషించారు. గణపతి జ్ఞానాన్ని, భక్తిని, తల్లిదండ్రుల పట్ల ఆయనకున్న గౌరవాన్ని మెచ్చి ఆయనకు గణాధిపత్యాన్ని ప్రసాదించారు. అప్పటి నుంచి గణాలకు అధిపతిగా గణాధిపతి, విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా గణపతి భక్తుల పూజలు అందుకుంటున్నారు. వినాయక చవితి రోజున భక్తులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇళ్లలోనే కాకుండా వీధులు, కాలనీలు, గ్రామాలు, పట్టణాల్లో సామూహికంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రాంతీయ సంప్రదాయాలకు అనుగుణంగా ఈ ఉత్సవాలు అనేక రోజుల పాటు కొనసాగుతాయి. భక్తులు పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో భక్తి, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించుకుంటారు. ఉత్సవాల ముగింపు రోజున గణపతి విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేస్తారు. "గణపతి బప్పా మోరియా" అనే నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణం మార్మోగుతుంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారతీయుల మధ్య జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు సామూహిక గణపతి ఉత్సవాలు ఉపయోగపడతాయని భావించిన బాల గంగాధర్ తిలక్ 1893లో ఈ ఉత్సవాలను సామూహిక స్థాయిలో నిర్వహించే సంప్రదాయానికి ఊతమిచ్చారు. కులాలు, వర్గాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో గణపతి ఉత్సవాలు కీలక పాత్ర పోషించాయి. శ్రీ గణపతి కథ కేవలం పురాణగాథ మాత్రమే కాదు. తల్లిదండ్రుల పట్ల గౌరవం, విధి పట్ల నిబద్ధత, జ్ఞానం, వినయం, భక్తి వంటి గొప్ప విలువలను జీవితంలో ఆచరించాలని సందేశమిస్తుంది. అందుకే ప్రతి శుభకార్యం ప్రారంభంలో భక్తులు శ్రీ మహా గణపతిని స్మరిస్తూ "ఓం గం గణపతయే నమః" అని ప్రార్థిస్తారు. విఘ్నాలను తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించి, ప్రతి కార్యాన్ని విజయవంతం చేసే శ్రీ మహా గణపతికి భక్తులు శతకోటి నమస్కారాలు అర్పిస్తున్నారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

- భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు, అక్షర ప్రకాశం : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్‌రాజు, ఐపీఎస్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ధైర్యంగా జీవించాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే గణనాథుడి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సకల శుభాలు కలగాలని, ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములై సంతోషంగా ముందుకు సాగాలని కోరారు. వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా పోలీసు శాఖ జారీ చేసిన భద్రతా సూచనలు, నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ సూచనల మేరకు నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రజల సహకారంతో వినాయక చవితి వేడుకలు సంతోషకరమైన వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోరారు.

మౌలాబి కుటుంబానికి న్యాయం చేయాలి

- కౌశిక్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి: డాక్టర్ షేక్ మహబూబ్‌వలి

- మైనారిటీలకు అండగా నిలిచి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

తర్లపాడు, అక్షర ప్రకాశం : సింగరాయకొండలోని శ్రీ చైతన్య నవోదయ శిక్షణా కేంద్రంలో కౌశిక్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్‌వలి కోరారు. కౌశిక్ మృతికి న్యాయం చేయాలని 16 రోజులుగా నిరాహార దీక్ష చేపట్టిన అతని తల్లి సయ్యద్ మౌలాబి మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆదివారం తర్లపాడు మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాలు, ముస్లిం మైనారిటీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌశిక్ మృతి ఘటనపై వాస్తవాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని మహబూబ్‌వలి కోరారు. శ్రీ చైతన్య నవోదయ శిక్షణా కేంద్రం నిర్వహణ, అనుమతులు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించాలని సూచించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మౌలాబి కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, వారికి అండగా నిలవాలని అన్నారు. మైనారిటీ కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కౌశిక్, మౌలాబి మృతికి సంబంధించిన పరిస్థితులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. అలాగే పోలీసు, విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు, మైనారిటీ నాయకులు వారికి అండగా ఉంటారని మహబూబ్‌వలి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, తర్లపాడు మాజీ మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు షేక్ అక్బర్ బాషా, సీపీఎం రైతు సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జీవయ్య, ప్రజా సంఘాల నాయకులు షేక్ నాగూర్ మీరావలి, తర్లపాడు గ్రామ ప్రజలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం
సోమవారం 14 - 9 - 2026

మట్టి వినాయకుడినే పూజిద్దాం

▸▸ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల వినియోగం ఎంతో అవసరం: ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ▸▸ 4,500 మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ
▸▸ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు
▸▸ డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పంపిణీ
▸▸ కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు
▸▸ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోనూ మట్టి ప్రతిమల పంపిణీ
- మట్టి వినాయకుడినే పూజించాలని ఎమ్మెల్యే పిలుపు

ఒంగోలు, అక్షర ప్రకాశం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని రాష్ట్ర ఒంగోలు శాసనసభ్యుడు శ్రీ దామచర్ల జనార్దన్‌రావు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఒంగోలు నగరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పలు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 4,500 మట్టి వినాయక ప్రతిమల పంపిణీకి శ్రీకారం చుట్టారు. నగరంలోని రత్నమహల్ థియేటర్, కొత్తపట్నం బస్‌స్టాండ్, కర్నూలు రోడ్ ఫ్లైఓవర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, కొత్త మార్కెట్, రంగారాయుడు చెరువు ప్రాంతాల్లో ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించడం ఉత్తమమని తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా సంప్రదాయాన్ని కాపాడటంతో పాటు ప్రకృతిని పరిరక్షించిన వారమవుతామన్నారు. అనంతరం ఒంగోలు నగరంలోని గాంధీరోడ్డులో నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందజేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాలకు సహకరించి మట్టి వినాయకుడినే పూజించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో 14 డివిజన్ అధ్యక్షులు బెజవాడ ఆంజనేయులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, డీజేఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, నగర ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం

సోమవారం 14 - 9 - 2026

150 ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభం

• 9,567 మందికి వైద్య సేవలు.. 119 ఆస్పత్రులు, 680 మంది సిబ్బంది సహకారం

• ఇస్లాంపేటలో తొలి శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

• 119 ప్రైవేటు ఆస్పత్రుల సహకారం.. 680 మంది వైద్య సిబ్బంది సేవలు

• నియోజకవర్గవ్యాప్తంగా 9,567 మందికి ఉచిత వైద్యం

• ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే లక్ష్యం

• వైద్య శిబిరాల నిర్వహణకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

ఒంగోలు, అక్షర ప్రకాశం : ఒంగోలు మున్సిపాలిటీగా ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తికానున్న సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఒంగోలు నియోజకవర్గ పరిధిలో 150 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక 4వ డివిజన్ ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, పరీక్షల వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిబిరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒంగోలు మున్సిపాలిటీ 150 సంవత్సరాల ప్రస్థానంలో నగర అభివృద్ధికి ప్రజలు అందించిన సేవలు, సహకారం ఎంతో కీలకమన్నారు. నగర ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. అందులో భాగంగానే 150 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శిబిరాలకు 119 ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మొత్తం 680 మంది వైద్య సిబ్బంది ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు సహకరించారని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించిన శిబిరాలకు సుమారు 9,567 మంది ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారని వెల్లడించారు. 150 వైద్య శిబిరాల్లో ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం వినాయక చవితి పండుగ ఉన్నప్పటికీ వైద్య శిబిరాల నిర్వహణకు సహకరించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, 119 ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సున్నిత ఘటనలపై వాస్తవాలు తెలుసుకున్నాకే స్పందించాలి

- తౌషిక్ కేసులో అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారితో విచారణ.. శాస్త్రీయ ఆధారాల సేకరణ

ఒంగోలు, అక్షర ప్రకాశం : సున్నితమైన ఘటనలకు సంబంధించిన పూర్తి వాస్తవాలను అధికారుల నుంచి తెలుసుకున్న తర్వాతే స్పందించాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు సూచించారు. వాస్తవాలు తెలుసుకోకుండా స్పందించడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల అనవసర గందరగోళం, సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో తౌషిక్ కేసు, అతని తల్లి మౌలాబి మృతి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సింగరాయకొండలోని చైతన్య నవోదయ పాఠశాలలో 11 ఏళ్ల తౌషిక్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అప్పటి నుంచే పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారని ఎస్పీ తెలిపారు. వివిధ కోణాల్లో విచారణ జరిపి పలువురిని ప్రశ్నించి వివరాలను సేకరించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తును స్థానిక ఎస్హెచ్‌ఓకి కాకుండా కందుకూరు ఉపవిభాగం సీఐ స్థాయి అధికారికి అప్పగించినట్లు వివరించారు. దర్యాప్తులో భాగంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల పరిసర ప్రాంతాల్లోని వ్యక్తులను విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిపారు. తౌషిక్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో సుమారు 70 మంది విద్యార్థులను విచారించినట్లు చెప్పారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను కూడా ప్రశ్నించినట్లు వెల్లడించారు.

హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు

తౌషిక్ తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారని ఎస్పీ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తు, విచారణ చర్యలు, సేకరించిన వివరాలను సంబంధిత అధికారులు కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు కోసం నెల్లూరు అదనపు ఎస్పీని ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు.

దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్లు, సీసీ కెమెరాల దృశ్యాలను స్వాధీనం చేసుకుని పరిశీలించడంతో పాటు, ఘటన జరిగిన ప్రదేశంలో న్యాయవిజ్ఞాన ప్రయోగశాల సిబ్బంది ద్వారా శాస్త్రీయ ఆధారాలను సేకరించినట్లు ఎస్పీ వివరించారు. ప్రతి అంశాన్ని నిపుణులతో పరిశీలించి లోతుగా విశ్లేషిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మౌలాబికి పలుమార్లు కౌన్సెలింగ్

కుమారుడి మృతికి న్యాయం చేయాలని తౌషిక్ తల్లి మౌలాబి ధర్నా చేయడంతో పాటు పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిన సందర్భాల్లో పోలీసులు వెంటనే స్పందించి ఆమెను రక్షించారని ఎస్పీ తెలిపారు. ఆమెకు మనోధైర్యం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ అందించినట్లు చెప్పారు. కనిగిరిలో భవనం పైనుంచి దూకేందుకు ప్రయత్నించిన సందర్భంలోనూ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి ఆమెను రక్షించినట్లు వెల్లడించారు. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు తీవ్ర మానసిక వేదనలో ఉంటారని, వారి బాధను మాటల్లో చెప్పలేమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో మౌలాబి మృతి చెందడం అత్యంత బాధాకరమైన ఘటనగా అభివర్ణించారు.

సామాజిక మాధ్యమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో వార్తలు, వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎస్పీ సూచించారు. ఇది అత్యంత సున్నితమైన అంశమని, ప్రస్తుతం కేసు హైకోర్టు పరిధిలో కూడా విచారణలో ఉందని తెలిపారు. పాఠశాలకు సంబంధించిన వివరాలు విద్యాశాఖ పరిధిలో ఉన్నాయని, సంబంధిత సమాచారం అధికారికంగా పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. ఘటనకు సంబంధించి ప్రజా సంఘాలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ.. పూర్తి వివరాలు, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే మాట్లాడాలని, వార్తలను ప్రచురించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోరారు. పరిస్థితులను మరింత సున్నితంగా మార్చకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

- గణేష్ విగ్రహాల నిర్వాహకులకు ఒంగోలు డీఎస్పీ సూచనలు - భద్రతా నిబంధనలు పాటించాలి.. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలి

ఒంగోలు, అక్షర ప్రకాశం : వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ విగ్రహాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఒంగోలు డీఎస్పీ సూచించారు. పండుగను పురస్కరించుకుని ఒంగోలు ఒకటో పట్టణం, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులతో డీఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటు నుంచి పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం వరకు ప్రతి దశలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలకు అసౌకర్యం లేకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలన్నారు. విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణ, జనసమ్మర్దం నియంత్రణ, శబ్ద కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని డీఎస్పీ కోరారు. పోలీసుల సూచనలు పాటిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు.

మౌర్య హోటల్‌లో ఘనంగా వినాయక చవితి పూజలు

- భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు
- వినాయకుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష
- విఘ్నాలు తొలగి సర్వాభివృద్ధి కలగాలని స్వామివారికి ప్రార్థనలు
- త్రిమూర్తి స్వరూపుడైన గణనాథునికి ఘనంగా పూజలు
- మౌర్య హోటల్ ప్రాంగణంలో వైభవంగా వినాయక చవితి వేడుకలు
- పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, నిర్వాహకులు

ఒంగోలు, అక్షర ప్రకాశం : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక మౌర్య హోటల్‌లో గణనాథుడికి ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.



హోటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజలు, అర్చనలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణనాథుడు సకల ప్రకృతి శక్తుల సమ్మేళనానికి ప్రతీకగా, సమస్త గణాలకు నాయకుడిగా విశిష్టమైన స్థానం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తత్త్వాలను తనలో ఇముడ్చుకున్న త్రిమూర్తి స్వరూపుడైన విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా విఘ్నాలు తొలగి, శుభకార్యాలు విజయవంతంగా సాగుతాయని తెలిపారు. ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సర్వాభివృద్ధి కలగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమంలో మౌర్య హోటల్ అధినేత బత్తిన మహేష్, మాజీ బీజేపీ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్ కుమార్, సూరే సాయి కృష్ణ, కంది మురళి, కొమ్ము కళ్యాణ్, దళపతి, ఆనందు, బత్తిన మాలకొండయ్య తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఇంటింటికి ఆయుర్వేదం ప్రభుత్వ లక్ష్యం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యం ఆయుర్వేదంతో సాధ్యం
- ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. భ్రమరాంబ

ఒంగోలు, అక్షర ప్రకాశం : స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని బి.ఎం.ఆర్. కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆయుర్వేద ప్రేమికులు, ఔషధ సేవనకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. భ్రమరాంబ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ రాజుల ఆదేశాల మేరకు ప్రజల్లో ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో ఉన్న పరిష్కార మార్గాలను ఆమె వివరించారు. వాత, పిత్త, కఫ త్రిదోషాలు, వాటి లక్షణాలు, నివారణ మార్గాలను సోదాహరణంగా వివరించారు. ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా, ధ్యానం, సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, వీటి ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరానికి అనుగుణంగా ఆయుర్వేద ఔషధాలను ఉచితంగా అందించారు. ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించి, ఈ వైద్యాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేసేందుకు త్వరలో 'ఇంటింటికి ఆయుర్వేదం' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డాక్టర్ భ్రమరాంబ వెల్లడించారు. భారతదేశంలో వేల సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్యం ప్రాచుర్యంలో ఉందని ఆమె తెలిపారు. రోగాలను నియంత్రించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు దోహదపడే వైద్య విధానం కావడం వల్లనే దీనికి 'ఆయుర్వేదం' అనే పేరు వచ్చిందని వివరించారు. శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతిగృహం పాలకవర్గ కోశాధికారి నూనె రామాంజనేయులు మాట్లాడుతూ ఉచిత ఆయుర్వేద అవగాహనా సదస్సు, వైద్య శిబిరం నిర్వహించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ ఎం. భ్రమరాంబకు కృతజ్ఞతలు తెలిపారు. భాగవత ప్రచార సేవాసమితి అధ్యక్షులు, తెలుగు అధ్యాపకులు ఎం.వి.ఎస్. శాస్త్రి మాట్లాడుతూ ఆయుర్వేదం మానవుని ఆయుష్షును పెంపొందించే వైద్య విధానమని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఆయుర్వేద వైద్య విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద ఔషధాల వినియోగం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు సులభమైన మార్గాలు ఉన్నాయని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు మాట్లాడుతూ ఆయుర్వేదం దైవానుగ్రహంగా భావించదగిన గొప్ప వైద్య విధానమని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ సభ్యులు కనమర్లపూడి బాలకోటేశ్వరరావు, ధనిశెట్టి రామునాయుడు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఈమని బలరాం, వేమూరి చక్రధర పెరుమాళ్లు, పి. శ్రీనివాసులు, హరిబాబు, కార్యాలయ అధికారి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో డ్రైనేజీ వ్యవస్థను నాశనం చేసింది మీరే

- కోన రఘుపతిపై ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ధ్వజం

బాపట్ల, అక్షర ప్రకాశం : నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. శనివారం బాపట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో ప్రజలకు కోట్ల రూపాయల మేర సహాయం అందించానని, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కోన రఘుపతి నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. మురుకొండపాడు గ్రామంలో రూ.3.50 లక్షల వ్యయంతో రైతుల కోసం పంపుహౌస్ నిర్మించామని నరేంద్ర వర్మ తెలిపారు. అయితే తన సొంత నిధులతో రైతులకు నీరు అందించానని కోన రఘుపతి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బాపట్లను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న కోన రఘుపతి హయాంలో పట్టణ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఒకప్పుడు పట్టణంలో దోమల సమస్య స్వల్పంగా ఉండేదని, గత పాలనలో పారిశుద్ధ్య పరిస్థితులు దిగజారడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిందని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, అభివృద్ధి విషయంలో రాజకీయ విమర్శలకు కాకుండా పనులకు ప్రాధాన్యం ఇస్తామని నరేంద్ర వర్మ పేర్కొన్నారు.

జోరువానలోనూ ఆగని కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు

- 58 నెలలుగా ప్రతి నెల 12న పేదలకు అన్నసమారాధన.. బారులు తీరిన అన్నార్తులు

పాయకాపురం, అక్షర ప్రకాశం : పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గత 58 నెలలుగా ప్రతి నెల 12వ తేదీన అజిత్‌సింగ్‌నగర్‌లోని కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. శనివారం జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ అన్నదాన కార్యక్రమాన్ని ఎక్కడా ఆపకుండా నిర్వహించడంతో అన్నార్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు కళ్ళే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నసమారాధన చేశారు. కళ్ళే నాగేశ్వరరావు మాట్లాడుతూ.. స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుంచి ప్రతి నెల 12వ తేదీన క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదల ఆకలి తీర్చాలనే సంకల్పంతో రుచికరమైన నాన్‌వెజ్ భోజనంతో పాటు స్వీట్, గారె, చికెన్, గుడ్డు, సాంబారు, పెరుగు, పచ్చడి తదితర వంటకాలను అందిస్తున్నామని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లోనూ సేవలకు విరామం లేదని, తమ ఆర్థిక స్థోమతకు అనుగుణంగా పేదలకు ఆహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. లలిత జీవించి ఉన్న సమయంలో పేదల ఆకలి తీర్చాలని తనతో చెప్పేవారని, ఆమె ఆశయాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రతి నెల అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు.

కళ్ళే లలిత ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సైకిళ్ల పంపిణీ, ఏడాది పొడవునా చల్లని నీటితో చలివేంద్రం, పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాల పంపిణీ, చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్ల అందజేత, రోగులకు ఉచిత మందులు, భోజన సదుపాయం, పేద మహిళల జీవనోపాధి కోసం తోపుడు బండ్ల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు నాగేశ్వరరావు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించి పేదలకు అండగా నిలుస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, ముప్పూరి హరీష్, జయ దుర్గా, మాజీ కార్పొరేటర్ చందన సురేష్ (మాము), ఎం. జశ్విన్, జి. ధ్రువన్, అనిల్, ప్రసాద్ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంగోలు, అక్షర ప్రకాశం : స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని బి.ఎం.ఆర్. కళ్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆయుర్వేద ప్రేమికులు, ఔషధ సేవనకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. భ్రమరాంబ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ రాజుల ఆదేశాల మేరకు ప్రజల్లో ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తదితర ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదంలో ఉన్న పరిష్కార మార్గాలను ఆమె వివరించారు. వాత, పిత్త, కఫ త్రిదోషాలు, వాటి లక్షణాలు, నివారణ మార్గాలను సోదాహరణంగా వివరించారు. ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా, ధ్యానం, సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, వీటి ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరానికి అనుగుణంగా ఆయుర్వేద ఔషధాలను ఉచితంగా అందించారు. ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించి, ఈ వైద్యాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేసేందుకు త్వరలో 'ఇంటింటికి ఆయుర్వేదం' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డాక్టర్ భ్రమరాంబ వెల్లడించారు. భారతదేశంలో వేల సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్యం ప్రాచుర్యంలో ఉందని ఆమె తెలిపారు. రోగాలను నియంత్రించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు దోహదపడే వైద్య విధానం కావడం వల్లనే దీనికి 'ఆయుర్వేదం' అనే పేరు వచ్చిందని వివరించారు. శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతిగృహం పాలకవర్గ కోశాధికారి నూనె రామాంజనేయులు మాట్లాడుతూ ఉచిత ఆయుర్వేద అవగాహనా సదస్సు, వైద్య శిబిరం నిర్వహించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ ఎం. భ్రమరాంబకు కృతజ్ఞతలు తెలిపారు. భాగవత ప్రచార సేవాసమితి అధ్యక్షులు, తెలుగు అధ్యాపకులు ఎం.వి.ఎస్. శాస్త్రి మాట్లాడుతూ ఆయుర్వేదం మానవుని ఆయుష్షును పెంపొందించే వైద్య విధానమని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఆయుర్వేద వైద్య విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద ఔషధాల వినియోగం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు సులభమైన మార్గాలు ఉన్నాయని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు మాట్లాడుతూ ఆయుర్వేదం దైవానుగ్రహంగా భావించదగిన గొప్ప వైద్య విధానమని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గిరిప్రదక్షిణ కమిటీ సభ్యులు కనమర్లపూడి బాలకోటేశ్వరరావు, ధనిశెట్టి రామునాయుడు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఈమని బలరాం, వేమూరి చక్రధర పెరుమాళ్లు, పి. శ్రీనివాసులు, హరిబాబు, కార్యాలయ అధికారి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మాస్టర్ ఆఫ్ సెర్మనిగా తీగల సత్యవతి వ్యవహరించారు. ఆయుష్ శాఖ సిబ్బంది ఎం. రమాదేవి, ఎం. శ్రీనివాసులు డాక్టర్ ఎం. భ్రమరాంబ సూచనల మేరకు శిబిరానికి హాజరైన వారికి ఔషధాలను పంపిణీ చేశారు.

అక్షర ప్రకాశం

సోమవారం 14 - 9 - 2026

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన సింగు నాగమల్లేశ్వరి కు పూర్వ విద్యార్థుల ఘన సన్మానం

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : గురుపూజోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న చిలకలూరిపేట గ్రామీణ ప్రాంత యనమదల మండల ప్రజా పరిషత్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సింధు నాగమల్లేశ్వరిని శనివారం వారి పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వారి స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా కలిసి టీచర్ కి శాలువా కప్పి, సాయి సచ్చరిత్ర గ్రంథమును అందజేసి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ. నాగమల్లేశ్వరి తమకు కేవలం చదువు మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, మంచి విలువలని నేర్పి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబడేలా తీర్చిదిద్దారని కొనియాడారు. ఆమె విద్యా రంగానికి చేసిన సేవలకు గాను ఈ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పదవ తరగతి అభ్యసించేటప్పుడు వారు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా ఎన్నో సూత్రాలను తెలిపారని వారి యొక్క ఆధారాబిమానాలతో సమాజంలో మంచి స్థితిలో ఉన్నామని తెలి పారు. సన్మాన గ్రహీత నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులు సాధించిన ఉన్నత స్థానాలే ఉపాధ్యాయులకు అసలైన అవార్డులని పేర్కొన్నారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ పూర్వ విద్యార్థులంతా ఒకచోటికి చేరి తనను ఇంతలా గౌరవించడం, సన్మానించడం తన జీవితంలో మరువలేని అనుభూతి అని భావోద్వేగానికి గురయ్యారు. తమ విద్యార్థులందరూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిలకలూరిపేట పట్టణ ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము మరియుజయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ, పట్టణ పుర ప్రముఖులుతోట శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది పొందూరి నరేంద్ర,, ఉపాధ్యాయులు షేక్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

45 వేల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

- భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

విజయవాడ, అక్షర ప్రకాశం : వినాయక చవితి సందర్భంగా గుడిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ 33వ డివిజన్సత్యనారాయ ణపురంలోని బాబురావు మేడ సెంటర్లో 45 వేల మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు స్వయంగా ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గుడిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని అన్నారు. ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించి, మట్టి విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన పార్టీ నాయకులు గుడిపాటి సీతారాం మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల మట్టి వినాయక ప్రతిమలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, గుడిపాటి ఫౌండేషన్ ప్రతినిధులు బోను శ్యామ్, నూకల బాలాజీ, దిట్టకవి మాధవరావు, పీసుపాటి ఫణి, గుడిపాటి జయరామ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

రంగంపేట, అక్షర ప్రకాశం : ఉత్తమమైన విద్యా బోధన ద్వారా విశిష్టమైన సేవలు అందిస్తున్న డాక్టర్ వి.సి. జాకబ్, గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామంలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నందిగాం సత్య కళ్యాణ చక్రవర్తి లకు కాకినాడకు చెందిన చేయూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేయటం అభినందనీయమని రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. పార్థసారథి, నాయకంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చిన్నరాజులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, అర్జేడి నాగమణి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్.శేషారెడ్డిల చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవటం ప్రశంసనీయమన్నారు. అంకితభావంతో విద్యార్థులకు విశిష్టమైన విద్యా సేవలు అందిస్తూ, పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన జాకబ్, చక్రవర్తి మాస్టర్లు పలువురికి స్ఫూర్తిదాయమని, భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యా కమిటీ కోఆప్షన్ సభ్యులు ఉండవల్లి వెంకటరావు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు జాకబ్, చక్రవర్తి మాస్టర్లు కి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షులు ను కలసిన గిద్దలూరు నాయకులు

గిద్దలూరు, అక్షర ప్రకాశం : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ పి వి కృష్ణా రావు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస రెడ్డి గారిని మార్కాపురం జిల్లా మార్కాపురం భారతీయ జనతా పార్టీ ఆఫీసులో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు, కమలాపురి వేణుగోపాల్ కలిసి రాబోయే స్థానిక ఎన్నికలలో గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల గురించి, పంచాయతీ ఎన్నికలు, ఎం పి టి సీ, జె పి టి సీ ఎన్నికలలో కూటమిలో భాగంగా పోటీచేసే భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల ఎంపిక విజయం సాధించడం కోసం అనుసరించవలసిన విధానాల గురించి, గిద్దలూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుల నియామకం గురించి, భవిష్యత్తు లో పార్టీ విస్తరణ నూతన కమిటీ ల నియామకం గురించి చర్చ చేయడం జరిగింది.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,